**ఆయన మనసు ఆకాశమంత సువిశాలమైంది..** దాతృత్వంలో భూదేవి అంత పెద్దది.. ఎదుటి వారు కష్టాల్లో ఉన్నప్పుడు ఆయన చూపే ఆత్మీయత, ఆయన దాతృత్వం ఎల్లలు ఎరుగనిది.. జీవితంలో కష్టాలంటే ఎమిటో కండ్లారా చూసి, పట్టుదల క్రమశిక్షణతో ఒక్కో మెట్టూ ఎదుగుతూ.. అత్యున్నత స్థితికి చేరుకున్న ఆయన నేటికీ పేదవాడి కష్టాలను చూస్తే చలించిపోతారు.. అందుకే ఆయన వ్యాపారం చేసినా, రాజకీయాలు నెరిపినా నిష్కామయోగిలా, సేవా సంపన్నుడిగా కీర్తి గడిస్తున్నారు.. ప్రతీది స్వార్థ మయం అయిన నేటి రోజుల్లో ఇంతటి సుగుణాలున్న వ్యక్తి ఖమ్మంలో ఎవరున్నారో ఇప్పటపికే మీకు అర్థమై ఉంటుంది.. అవును ఆయనే ఎంపీ రాజ్యసభ సభ్యులు, గాయత్రి గ్రానైట్స్ అధినేత, నిగర్వి, దార్శనికుడు వద్దిరాజు రవిచంద్ర అలియాస్ గాయత్రి రవి, అలియాస్ రవన్న. ఇప్పటికే లెక్కలేనన్ని సేవా కార్యక్రమాలకు తన వంతుగా సాయం అందిస్తూ వస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తాజాగా మరో సారి తన మానవత్వం చాటుకుని తనలోని దార్శనికత, సేవా తత్పరతకు హద్దుల్లేవని చాటుకున్నారు. అంతు చిక్కని వ్యాధితో అనతి కాలంలోనే తల్లిదండ్రులను కోల్పోయి దిక్కు తోచని స్థితిలో ఉన్న ఇద్దరు విద్యార్థులను చేరదీసి వారి ఇంటర్ విద్యకు అవసరమైన డబ్బులు చెల్లించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారు. ఎంపీ వద్దిరాజు చూపిన మానవత్వానికి జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రతినిధి



# సేవల్లో శిఖరం..

## ఎంపి వద్దిరాజు రవిచంద్ర

- దాతృత్వానికి కేరాఫ్‌గా నిలిచిన ధీశాలి..
- తల్లిదండ్రులను కోల్పోయిన అన్నదమ్ములకు ఉన్నత విద్యకు సాయం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న రాజ్యసభ సభ్యుడు
- అనాథలుగా మారకూడదనే నా ఆలోచన...ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

### అనతికాలంలోనే విధివంచితులైన అన్నదమ్ములు..

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామానికి చెందిన మొగిలిశెట్టి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు (శశిఅభినయ్, పవన్ విలాస్) కుమారులున్నారు. వృత్తిరిత్యా మొగిలిశెట్టి శ్రీనివాసరావు లారీ డ్రైవర్ గా ఉంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇద్దరు పిల్లలతో కుటుంబం హాయిగా గడుపుతున్న వేళ మాయదారి అంతుచిక్కని వ్యాధి శ్రీనివాసరావు ఆరోగ్యాన్ని కుంగదీసింది. వ్యాధి వచ్చిన నాటినుండి పలు హాస్పిటళ్లలో వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయింది. అసలే పేద కుటుంబానికి చెందిన శ్రీనివాసరావు ఆరోగ్యం బాగు చేయించుకునేందుకు గాను హాస్పిటళ్ల ఖర్చుకు చేతిలో ఉన్న కొన్ని డబ్బులు కూడా హారతి కర్పూరంలా కరిగిపోయాయి. ఈ క్రమంలోనే ఇటీవల కొన్నేళ్ల కిందట శ్రీనివాసరావును మృత్యువు కబళించింది. భర్త చనిపోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న విజయలక్ష్మి తన ఇద్దరు కుమారులను చదివించుకునేందుకు పడరాని పాట్లు అన్నీ పడింది. కానీ రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబంలో మరో పెద్ద విషాదానికి గురైంది. ఎదిగి వస్తున్న ఇద్దరు చిన్నారులకు అండగా ఉన్న వారి తల్లి కూడా అంతుచిక్కని వ్యాధిలో మృత్యువుతో పోరాడి 2020లో తనువు చాలించింది. అంతే ఇక ఆ కుటుంబంలో కారు చీకటి అలముకున్నది. ఇద్దరు చిన్నారులు దిక్కులేని వారయ్యారు. నాయనమ్మ, తాతయ్య దగ్గర వారిని సాకే స్తోమత లేకపోవడంతో తనికెళ్ల గ్రామంలోని వారి అమ్మమ్మ, తాతయ్య తొగరు కృష్ణవేణి, గోపాలరావు వీరిద్దరినీ చేరదీశారు. వారు కూడా నిరుపేదలే కావడంతో ఇద్దరు పిల్లల భవిష్యత్తు అంధకారంలో పడింది. ఆర్థిక సాయం అందించే వారు లేక ఇద్దరూ వారి పోషణకోసం ఓ దుకాణంలో గుమస్తాలుగా చేరాలని ఆలోచిస్తుండగా సరిగ్గా ఇదే సమయంలో తనికెళ్లకు



చెందిన సీనియర్ జర్నలిస్టు ఆకుతోట ఆదినారాయణ ద్వారా విద్యార్థుల సమస్య తెలుసుకున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తనదైన శైలిలో స్పందించారు.

**అమ్మానాన్న లేని లోటు తీర్చిన ధీశాలి..**

ఎదుటి వారి కష్టాలను చూసి చలించిపోయే గుణమున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇద్దరు విద్యార్థులు దిక్కులేని వారు అయ్యారన్న సమాచారం తెలుసుకుని వారిని చేరదీశారు. ఈ క్రమంలోనే  ఆ ఇద్దరిలో పెద్దవాడైన శశి అభినయ్, చిన్నవాడైన పవన్ విలాస్ ఇంటర్ విద్యను పూర్తిచేసేందుకు తాను అండగా నిలిచారు. అందుకు గాను ఒకొక్కరికి రూ. 1.60లు చొప్పున ఇద్దరికీ కలిపి రూ.3.20లక్షల ఖరీదైన ఫీజు చెల్లించి ఖమ్మంలోని రెజోనెన్స్ కాలేజీలో చదివించారు. ఇద్దరు విద్యార్థులకు అమ్మానాన్న లేని లోటు తీర్చారు. కాగా ఇద్దరు విద్యార్థుల్లో పెద్ద వాడు ప్రస్తుతం బీ టెక్ మూడో సంవత్సరం చదువుతుండగా, చిన్నవాడు పవన్ విలాస్ ప్రస్తుతం ఇంటర్ సెకెండియర్ పూర్తిచేశాడు. ఇద్దరు విద్యార్థులకు కూడా ఒకరు 956 మార్కులతో, మరొకరు 910 మార్కులతో ఇంటర్ విద్యలో అత్యుత్తమ ఫలితాలు సాధించి





ఎంపీ వద్దిరాజు ఆశయాన్ని నిలబెట్టారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థుల కాలేజీ ఫీజును ఎంపీ వద్దిరారాజు చెల్లించారు. ఈ సందర్భంగా వారిద్దరు ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కలిసిన సందర్భంగా వారిని ఆశీర్వదించారు. రాబోవు రోజుల్లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి ఎదుటి వారికి ఆదర్శంగా నిలవాలని ఆ అన్నదమ్ములకు ఎంపీ సూచించారు. తల్లిదండ్రులు లేకపోయినా వారి భవిష్యత్తు కారుచీకట్లో కలిసి పోకూడదన్న ఎంపీ వద్దిరాజు ఆశయానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా ఇద్దరు విద్యార్థులకకు చక్కని విద్యను అందించిన రెజోనెన్స్ విద్యాసంస్థల అధినేత శ్రీధర్‌కు ఎంపీ రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు. కాగా తమ భవిష్యత్తుకు బాటలు వేసిన ఎంపీ వద్దిరాజు రవిచంద్రగారి సాయం జీవితాంతం గుర్తుంచుకుంటామని ఆ ఇద్దరు అన్నదమ్ములు మీడియా ప్రతినిధులకు తెలిపారు. కష్టాల్లో ఉన్న మాకు అమ్మానాన్న లేని లోటు తీర్చారని వారు కొనియాడారు. వద్దిరాజు రవిచంద్ర గారికి కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలు అనాధలుగా మారిపోయి, వారి భవిష్యత్తు అంధకారం కాకూడదన్న భావనతోనే వారి ఇంటర్ విద్యకు సాయం అందించాను. వీరిలాగే బాల్యంలో ఎవరూ ఇబ్బందులు పడకూడదు. చదివించే వారు లేక గుమస్తాలుగా, క్లర్కులుగా,

**అనాధలుగా మారకూడదనే నా ఆలోచన...**

ఉపాధి మార్గం చూపేవారులేక బంగారు భవిష్యత్తు బలిపీఠం ఎక్కకూడదనే నా సాయం అందించాను. సమాజంలో మనం ఎదుటివారికి చేసే సాయం మన కుటుంబానికి శ్రీరామరక్షలా ఉంటుంది. మనం బతుకుతూ ఎదుటివారిని బతికిద్దాం. అదే నిండు జీవితానికి అర్థం పరమార్థం.

**- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

**అమ్మానాన్న లేని లోటు తీర్చారు...**



అమ్మానాన్నలను కోల్పోయి అనాధలుగా మారిపోయేలా ఉన్న మా జీవితంలో విద్యను అందించి ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు బాటలు వేసిన మనసున్న దేవుడు వద్దిరాజు రవిచంద్ర గారి సహాయం మర్చిపోలేము. మా జీవితంలో ఏ స్థాయిలో ఉన్నా ఆయనను గుర్తుంచుకుంటాము. ఆయన అండతోనే ఇంటర్‌ను పూర్తిచేశాము. ఎంపీ గారి స్ఫూర్తితో ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించాము.

**- శశిఅభినయ్**

**ఉన్నత స్థాయికి చేరుకుంటాం..**



ఎంపీగారు మాకు పునర్జన్మను ప్రసాదించారు. తల్లిదండ్రులను కోల్పోయి చదివించే వారు లేక అనాధలుగా మారిపోతామను కున్న మాకు అండగా నిలిచారు. ఆయన మేలు జన్మలో మరిచిపోలేము. ఎంపీగారు మాకు కొండంత అండగా నిలిచారు. మేము కూడా పెద్దయ్యాక మాలాంటి అనాధలకు సాయం చేస్తాము. ఎదుటి వారి కష్టాలు పంచుకుంటాము.

**- పవన్ విలాస్**